సాక్షి విశాఖపట్నం

శనివారం : 13 : ఏప్రిల్ : 2024



'తూర్పు'లో 16 వేల కొత్త ఓట్లా?

విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఒకేసారి 16 వేలు కొత్త ఓటర్లు చేరడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

8లో



మొబైల్ ఫోన్ల అప్పగింత

రైళ్లలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను జీఆర్పీ పోలీసులు బాధితులకు శుక్రవారం అప్పగించారు.

8లో



పంచకర్ల బరితెగింపు

జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు నిబంధనలు ఉల్లంఘించారు. ఆలయ ప్రాంగణానికి ప్రచార రథంతో వచ్చారు.

12లో

భీమిలి.. బహుపరాక్



భూములపై కన్నేసిన గంటా గ్యాంగ్

- భూచోళ్లంతా ఏకమవుతున్నారు
- 2014 నుంచి 2019 మధ్య కాలంలో కబ్జాలకు పాల్పడిన గంటా అండ్ కో
- మళ్లీ భూకబ్జారాయుళ్లనంతా పోగేస్తున్న సూత్రధారి
- ఇప్పటికే గంటా పంచన చేరిన గాడు వెంకటప్పడు, కోరాడ నాగభూషణం
- ఐదేళ్లలో రూ.1500 కోట్ల విలువైన భూములు మింగేసిన గంటా బ్యాచ్

సాక్షి, విశాఖపట్నం : భీమిలి భయపడుతోంది.. 2014 నుంచి ఐదేళ్ల పాటు వారి చెరలో చిక్కుకున్న భూమాత మళ్లీ.. చిగురుటాకులా వణికిపోతోంది. భూచోళ్లు అంతా కలిసి వస్తున్నారని సంకేతాలతో జనం గుండెలు అదురుతున్నాయి. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్న చందాన అక్రమార్కులు అధికారం అండ ఉన్న బంధువులు కుమ్మక్కై, కనిపించిన జాగాలన్నీ కబ్జా చేసిన ఘనులకు సూత్రధారిగా నిలిచిన గంటా శ్రీనివాసరావు కన్ను ఇప్పుడు భీమిలిలో మిగిలిన భూములపైనా పడింది. అందుకే పట్టుబట్టి మరీ భీమిలి టికెట్ సాధించి ఇప్పుడు భూ కబ్జారాయుళ్లనంతా పోగేసుకుంటున్నారు.

ఒకప్పుడు దేశంలోనే రెండోదిగా, ఉమ్మడి ఏపీలో మొట్టమొదటి పురాతన మున్సిపాలిటీగా పేరు సొంతం చేసుకున్న ప్రశాంత భీమిలికి 2014–19 కాలంలో కొత్త పేరుని తీసుకొచ్చారు గంటా అండ్ కో. కాదేదీ కబ్జాకనర్హం అన్నట్లుగా వ్యవహరిస్తూ, భీమిలికి ఉన్న మంచి పేరుని కాస్తా చెరిపేసి.. భూకబ్జాల భీమిలిగా మార్చేసి.. నియోజకవర్గ పరువుని బంగాళాఖాతంలో కలిపేశారు. 2014 నుంచి ఐదేళ్ల పాటు భీమిలి నియోజకవర్గంలో పాగా వేసిన గంటా ఆక్రమించిన భూముల లెక్క రూ.1500 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. సహజంగా ఈ లెక్కలు చూస్తే ఎవరికైనా నిజమైనా... అనిపిస్తుంది.. కానీ ఆయన అల్లుడుతో పాటు బినామీలు, టీడీపీ తోడేళ్లు ఐదేళ్ల పాటు ఇదే పనిలో ఉండి వేల కోట్ల రూపాయల విలువ చేసే భూములు మింగేశారనేది ఆ ప్రాంతంలో ఎవరిని కదిపినా బయటకు వచ్చే వాస్తవం. వాటిలో కొన్ని మచ్చుకు పరిశీలిద్దాం..

సీలింగ్ భూముల కథ ఇదీ..

నిరుపేదలకు పంచిపెట్టాల్సిన సీలింగ్ భూములను చుట్టేసేలా గంటా అండతో అతని అల్లుడు, బినామీలు కలిసి భూదందా చేశారు. ఆనందపురం మండలం వేములవలస గ్రామానికి చెందిన కోరాడ వెంకటస్వామినాయుడు 1973 ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం తమ కుటుంబం పేరిట ఉన్న 45.59ఎకరాల మిగులు భూములను ప్రభుత్వానికి అప్పగించేందుకు అంగీకారం తెలిపారు. 1975వ సంవత్సరంలో ఆయన ఇచ్చిన భూ వివరాలను పరిశీలించిన ల్యాండ్ సీలింగ్ అథారిటీ ఆ భూముల అప్పగింతపై ట్రిబ్యునల్ తీర్పు (ఎల్‌సీసీ 230బై75) ఇచ్చింది. ఈ మేరకు విశాఖ రూరల్ మండలం మధురవాడలో సర్వే నంబర్ 262/4, 263/2, 276/1, 278, 276/2, 277/2, 329, 262/3, 277/1కి సంబంధించి 28.84ఎకరాలు, ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామంలో 1.66ఎకరాలు, ఆనందపురం గ్రామంలో 6.81ఎకరాలు, వెల్లంకి గ్రామంలో 8.28ఎకరాల భూముల వివరాలను ప్రభుత్వానికి అప్పగించారు. ఇక్కడ వరకు అంతా సాఫీగానే జరిగినా కోరాడ వెంకటస్వామి నాయుడు మృతి తర్వాత అసలు కథ మొదలైంది. ఆయన కుటుంబీకుల్లో కొందరు ప్రభుత్వానికి ఇచ్చేసిన భూములను సైతం అడ్డగోలుగా విక్రయించేశారు. మధురవాడ పంచాయతీ పరిధిలో ఇచ్చిన 28.84ఎకరాల భూమిని కోరాడ వారసులు కృష్ణా కో–ఆపరేటివ్ సొసైటీకి విక్రయించారు. ఈ వ్యవహారంపై అప్పటి చినగదిలి ఎమ్మార్వో ఉన్నతాధికారులను ఫిర్యాదు చేశారు. దీంతో సదరు కోరాడ వారసులు హైకోర్టులో పిటిషన్ వేశారు. తమ కుటుంబ అవసరాల నిమిత్తం ఆ భూములను విక్రయించేశామని, అందుకు బదులుగా తమకు ఆనందపురం మండలం వేములవలస పంచాయతీ బంటుపల్లి వారి కల్లాలు గ్రామంలో ఉన్న 28.80ఎకరాల (సర్వే నంబర్లు 39/1, 39/2) భూమిని అప్పజెబుతామని కోర్టును అభ్యర్థించారు. ఈమేరకు కోర్టు అంగీకరించి ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులను వెంటనే అమలు చేసి ఆ భూమిని స్వాధీనం చేసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు తాత్సారం చేశారు. దీంతో ఆ వారసులు మరోసారి ఆ భూముల్లో కొన్ని ఎకరాలను 2006లో విక్రయించేశారు. సర్వే నంబర్ 39/1, 39/5ఏలో 11.8ఎకరాల భూమిని విక్రయించేశారు. అదేవిధంగా వెల్లంకి గ్రామంలో ప్రభుత్వానికి ఇచ్చేసిన 1.14ఎకరాల భూమిని తిరిగి గారిపేట వాస్తవ్యుడు కోరాడ అప్పలస్వామి, రాములకు విక్రయించేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయగా, ఆ భూమికి బదులు సర్వే నంబర్ 263/2, 264/16లోని 1.14 ఎకరాలు అప్పగించారు. మళ్లీ 263/2 లోని 0.34ఎకరాల భూమిని అమ్మేశారు. మొత్తంగా 30 ఎకరాల పంపిణీకి సంబంధించిన పక్కా వివరాలు లేకున్నా కోరాడ కుటుంబీకులు మాత్రం ఇప్పటికే తాము 34.45ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వానికి అప్పగించామని లెక్క కట్టేశారు. ఇంకా తాము 11.14ఎకరాల భూమి మాత్రమే ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉందని తేల్చేశారు. ఆ 11.14ఎకరాల భూపంపిణీకీ ఇంకో మతలబు పెట్టారు. గతంలో తాము ఆనందపురం గ్రామంలో అప్పజెప్పిన 4.15ఎకరాలు రెండుపంటలు పండే భూమి అని పేర్కొన్నారు. పంటలు పండే భూమి, మిగులు భూముల నిష్పత్తి 1:2 ప్రకారం.. 11.14 ఎకరాల్లో 4.15 ఎకరాలను మినహాయించాలని ప్రతిపాదించారు. ఈ లెక్కన తాము కేవలం 6.63ఎకరాల భూమి మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని, ఆ భూమి కూడా నర్సీపట్నం పరిసరాల్లోని భూములను ఇస్తామని ప్రతిపాదించారు. ఈ లెక్కన కల్లాలు గ్రామంలోని 11.14ఎకరాల భూమిని తమకు మినహాయించాలని ప్రభుత్వానికి నివేదిస్తూ జిల్లాకోర్టులో కేసు వేశారు.

అల్లుడు రంగప్రవేశంతో..

కోర్టు విచారణ పూర్తికాకున్నా ఈలోగా గంటా అల్లుడు రంగంలోకి దిగారు. కోరాడ వారసులకు, అల్లుడికి మధ్య టీడీపీ నాయకులు కోరాడ నాగభూషణం, గాడు వెంకటప్పుడు, ఇతర నేతలు మధ్యవర్తిత్వం నెరిపారు. అధికారికంగా పేర్కొంటున్న 11.14ఎకరాలతో సహా తొక్కిపెట్టిన 30ఎకరాలపైగా భూమికి సంబంధించి ఒక్క గజం కూడా ఎవ్వరికీ పంపిణీ చేయకుండా వీళ్లే పంచేసుకునేందుకు ప్రణాళిక రూపొందించారు. అంతే కాదు.. గంటా భీమిలి ఎమ్మెల్యేగా.. మంత్రిగా నియోజకవర్గానికి ఏమీ వెలగబెట్టకపోయినా.. అడ్డగోలు సంపాదనకు మాత్రం తెరతీశారు. అనుచరగణంతో కలిసి భూదందాలతో రెచ్చిపోయారు. ప్రభుత్వ భూములను సైతం బ్యాంకుల్లో కుదువ పెట్టి రూ.కోట్ల రుణాలు పొందినట్లు కూడా వార్తలు వినిపించాయి. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే.. వెలుగులోకి రాని భూబాగోతాలెన్నో..

మళ్లీ.. అదే గ్యాంగ్‌తో హల్ చల్.!

భీమిలిలో గంటా గ్యాంగ్ చేసిన అక్రమాలు, ఆక్రమణలు, కబ్జాలతో ప్రజలంతా విసిగిపోయారు. ప్రశాంతంగా ఉండే ప్రాంతాన్ని భూకబ్జాల కేంద్రంగా మార్చిన గంటాకి 2019 ఎన్నికల్లో బుద్ధి చెబుతామని ప్రజలంతా డిసైడైపోయారు. విషయం తెలుసుకున్న గంటా.. నియోజకవర్గం నుంచి పారిపోయి ఉత్తరం పంచన చేరారు. ఆయన అనుచరగణం.. చెట్టుకొకరు.. పుట్టకొకరుగా వేరైపోయారు. ఐదేళ్ల గడిచిన తర్వాత ప్రజలు అంతా మర్చిపోయి ఉంటారని భావించిన గంటా.. తిరిగి భీమిలికి చేరుకున్నారు. వచ్చిందే తడవుగా.. తన కబ్జాల అనుచరగణాన్ని చేరదీసుకుంటున్నారు. టీడీపీలో సస్పెండ్‌కు గురైన కబ్జా గ్యాంగ్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేసేస్తూ.. మళ్లీ చక్రం తిప్పేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. గాడు వెంకటప్పడు, కోరాడ నాగభూషణరావు తదితర బ్యాచ్‌ను పోగేసుకుంటున్నారు. గంటా బాబా.. అరడజను దొంగల మాదిరిగా.. దొంగల ముఠా అంతా ఒక చోట చేరుతుండటంపై భీమిలి ప్రజలు మళ్లీ అభద్రతా భావానికి గురవుతున్నారు. ఇంక ఆక్రమించేందుకు ఏమున్నాయని వాపోతున్నారు. అయినా డబ్బులు ఎరవేసి, భయపెట్టి.. బెదిరించి.. ఎలాగైనా గెలవాలని భావిస్తున్న గంటా.. గెలిస్తే భీమిలిలో ఉన్న కొద్ది పాటి భూములను సైతం తన గ్యాంగ్‌తో కలిసి కాజేయ్యాలన్న కుట్రతో నియోజకవర్గంలో తిరుగుతున్నారు. ఇలాంటి వ్యక్తికి మరోసారి అందలం ఇస్తే.. భీమిలిని సర్వనాశనం చేస్తారని నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే
జగనే సీఎం కావాలి



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రి బొత్స సత్యనారాయణ, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ చంద్రమౌళి తదితరులు

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించిన రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

మధురవాడ : సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్ రెడ్డే సీఎం కావాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం భీమిలి నియోజకవర్గం మధురవాడ కార్‌షెడ్ జంక్షన్ వైఎస్సార్‌సీపీ ఎన్నికలు కార్యాలయాన్ని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్సార్‌సీపీ వ్యతిరేకమని జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాని సభలోనే చెప్పారన్నారు. కూటమి స్టాండ్ బహిర్గతం చెయ్యాలన్నారు. గంటా శ్రీనివాసరావు స్టీల్ ప్లాంట్ కోసం రాజీనామా చేసినట్టు చెప్పి బీజేపీతో అంటకాగుతున్నాడన్నారు. రాజీనామా చేసి ఎందుకు కోర్టుకు వెళ్లాడని ప్రశ్నించారు. పేదవాడి జీవితాల్లో వెలుగులు నింపడం కోసం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పాలన అందిస్తుందని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ఐదేళ్లలో భీమిలి అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చుచేసిందన్నారు. భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మీలను గెలిపించాలని పిలుపునిచ్చారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో రూ.2,700కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వీఎంఆర్‌డీ చైర్మన్ సనపల చంద్రమౌళి , శాసన మండలి సభ్యులు పెనుమత్స సురేష్, మాజీ మంత్రి బాలరాజ, మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, భీమిలి ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, కార్పొరేటర్లు డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక, లొడగల అప్పారావు, ఏపీ నగరాలు కార్పొరేషన్ కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, భీమిలి, పద్మనాభం ఎంపీపీ కె. రాంబాబు, జీవీఎంసీ 5, 6, 8 వార్డుల అధ్యక్షుడు పోతిన హనుమంతురావు, బొట్ట అప్పలరాజు, డాక్టర్ గాదె రోశిరెడ్డి, గుడ్ల పోలిరెడ్డి, వివిధ విభాగాలు నాయకులు వంకాయల మారుతీప్రసాద్, పీకేఎం పాత్రుడు, పిళ్లా సూరిబాబు, కుడితి రామారావు, పోతిన మూర్తి బాబు, పోతిన ఎల్లాజీ, పోతిన ప్రసాద్, ఎమ్. రాజేశ్వరి, చేకూరి రజని, మండల పార్టీల అధ్యక్షులు గాడు శ్రీను, బంక సత్యనారాయణ, కోరాడ లక్ష్మణ, కోరాడ వెంకటరావు, జీరు వెంకటరెడ్డి, కేపీ సత్యన్నారాయణ, పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి



మూడు రోజుల క్రితం అనివార్యకారణాలవల్ల పార్టీకి రాజీనామా చేస్తున్నానని, రాజకీయం వదిలేసి ఇంట్లో ఉంటానని చెప్పడం జరిగిందని భీమిలి ఎంపీపీ డి.వాసురాజు పేర్కొన్నారు. రెండు రోజులు నుంచి పార్టీ పెద్దలు వైవీ సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ, అవంతి శ్రీనివాసరావు, భీమిలి రూరల్ మండల నాయకులు తనతో మాట్లాడారన్నారు. ఇన్నాళ్లు సేవ చేసి ఇలాంటి సమయంలో దూరంగా ఉండొద్దని, జగన్‌ను ముఖ్యమంత్రిని చేయడంలో అంతా అండగా ఉండాలని చెప్పడంతో పార్టీ కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నానన్నారు. అలాగే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, బొత్స ఝాన్సీలక్ష్మి విజయానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

4వ స్థానం ఇంటర్‌లో

- ఇంటర్‌లో మెరిసిన విశాఖ విద్యార్థులు
- గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత
- ఫస్టియర్‌లో 77, సెకెండ్ ఇయర్‌లో 84 శాతం ఉత్తీర్ణత
- బాలుర కంటే బాలికలదే పై చేయి
- ఈ నెల 24 వరకు రీ వెరిఫికేషన్‌కు అవకాశం

పరీక్ష రాసిన ఫస్ట్ ఇయర్ విద్యార్థులు :	38,818
ఉత్తీర్ణులైన విద్యార్థులు :	30,050
పరీక్ష రాసిన సెకండ్ ఇయర్ విద్యార్థులు :	34,672
ఉత్తీర్ణులైన విద్యార్థులు :	29,258

మూడేళ్లుగా వచ్చిన ఫలితాలు

2021-22లో :	65 శాతం
2022-23లో :	70 శాతం
2023-24లో :	84.39 శాతం

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 174 జూనియర్ కాలేజీల నుంచి ఈ ఏడాది మొదటి, రెండో సంవత్సరం కలిపి 76,228 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వీరిలో 61,317 మంది ఉత్తీర్ణలయ్యారు. తద్వారా రాష్ట్ర స్థాయిలో జిల్లా నాల్గో స్థానంలో నిలిచింది. గతేడాది ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ప్రకటించిన ఫలితాల్లో మొదటి సంవత్సరం 63 శాతంతో రాష్ట్ర సూచికలో ఐదో స్థానం, సెకండ్ ఇయర్ 70 శాతం ఉత్తీర్ణతతో ఆరో స్థానం వచ్చింది. ఈ ఏడాది జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెరగడంతో పాటు, విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు.

ఈ ఏడాది ఫలితాలు ఇలా.. : ఈ ఏడాది మొదటి సంవత్సరంలో జనరల్ కోర్సులకు సంబంధించి మొత్తం 38,818 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వీరిలో 30,050 మంది ఉత్తీర్ణత సాధించారు. తద్వారా 77 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అదే విధంగా సెకండ్ ఇయర్‌లో 34,672 మంది హాజరు కాగా, వీరిలో 29,258 మంది ఉత్తీర్ణత సాధించారు. తద్వారా 84 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం 1,431 మందికి గాను 968 మంది పాసవ్వగా 68 శాతం ఉత్తీర్ణత సాధించారు. అదే విధంగా రెండో సంవత్సరం 1,307 మందికి గాను, 1,041 మంది పాసవ్వగా 80 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

పైపైకి ఫలితాలు : ఇంటర్మీడియెట్‌లో ఫలితాల్లో జిల్లా ఉత్తీర్ణత శాతం ఏడాదికేడాది పెరుగుతూ వస్తోంది. 2021–22లో 65 శాతం రాగా, 2022–23లో 70 శాతం వచ్చింది. 2023–24(ఈ ఏడాది)లో 84.39 శాతం సాధించడం ద్వారా జిల్లా విద్యార్థులు తమ సత్తా చాటారు. మార్కుల సాధనలోనూ రాష్ట్రంలోని మిగతా జిల్లాల కంటే ముందు వరుసలో నిలుస్తున్నారు.

రీ–వెరిఫికేషన్‌కు అవకాశం : విద్యార్థులకు ఫలితాల్లో ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే రీ–వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు అవకాశం కల్పించినట్లు ఆర్‌వో పి. మురళీధర్ వెల్లడించారు. రీ కౌంటింగ్‌కు ఒక్కో పేపరుకు రూ.260లు, రీ– వెరిఫికేషన్‌కు ఒక్కో పేపరుకు రూ.1,300లు చెల్లించి విద్యార్థులు చదివిన కాలేజీల ద్వారా ఈ నెల 24లోగా ఇంటర్మీడియెట్ బోర్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.



980 మార్కులు సాధించిన మోహన సాయిలక్ష్మిని అభినందిస్తున్న కేథరిన్ విద్యాసంస్థల ప్రతినిధులు

బాలికలదే పైచేయి

ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం ఫలితాల్లో కూడా బాలుర కంటే బాలికలే ముందు వరుసలో నిలిచారు. మొదటి సంవత్సరం జనరల్ కోర్సుకు బాలురు 20,745 మంది హాజరు కాగా, వీరిలో 15,858 మంది ఉత్తీర్ణత సాధించారు. తద్వారా 76 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికల్లో 18,073 మంది పరీక్షలు రాయగా, వీరిలో 14,192 మంది ఉత్తీర్ణత సాధించారు. తద్వారా 79 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అదే విధంగా సెకెండ్ ఇయర్ జనరల్ కోర్సులో బాలురు 18,436 మందికి 15,392 మంది పాసయ్యారు. 83 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికల్లో 16,236 మందికి గాను 13,866 మంది పాసయ్యారు. 85 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ కోర్సుల్లో సైతం బాలుర కంటే బాలికలు ఎక్కువ మంది పాసయ్యారు.

గంటా కుమారుడిపై
కేసు నమోదు

- స్వీట్‌బాక్స్‌లపై టీడీపీ స్టిక్కర్లతో రంజాన్ కానుకలు
- కోడ్ ఉల్లంఘన కింద కేసు



ముస్లిం మత పెద్దలను విచారిస్తున్న ఎన్నికల అధికారులు

మధురవాడ : భీమిలి నియోజకవర్గం మధురవాడలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఘటనలో భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ, టీడీపీ నాయకులు నమ్మి శ్రీను, జీవీఎంసీ 5వ వార్డు కార్పొరేటర్ తండ్రి, రాష్ట్ర బీసీ సెల్ నాయకుడు మొల్లి లక్ష్మణరావు తదితరులపై పీఎంపాలెం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంజాన్ సందర్భంగా గురువారం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపే నెపంతో శివశక్తినగర్ రోడ్డులోని సద్గురు సాయినాథకాలనీలోలో ఉన్న మసీద్–ఇ–ఫిర్దౌస్‌లో పార్టీ కండువాలు ధరించి భీమిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌ల ఫొటోలతో ఉన్న స్టిక్కర్లు అతికించి స్వీట్స్‌బాక్స్‌లు పంపిణీ చేశారు. వీటిని స్వయంగా గంటా కుమారుడు రవితేజ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, నమ్మి శ్రీను తదితరులు పంపిణీ చేశారు. దీనిపై 'సాక్షి' దినపత్రికలో 'టీడీపీ బరితెగింపు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. భీమిలి హార్టికల్చర్ ఆఫీసర్, నియోజకవర్గ ఎంసీసీ టీమ్–4 ఇన్‌చార్జ్ ఆర్‌పీ స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

గంటా బావమరిదిపై చర్యలు తీసుకోవాలి

ఈ పంపిణీ వ్యవహారంలో గంటా బావమరిది జీవన్ కుమార్‌తో పాటు మరికొంత మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారని, వీరు పేర్లు ఫొటోలు కూడా పత్రికలో ప్రచురితమయ్యాయి. అయితే వారి పేర్లను ఎఫ్‌ఐఆర్‌లో చేర్చలేదని విమర్శలు వస్తున్నాయి. మరింత లోతుగా విచారణ చేసి కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మనసు పెడితే మార్గం ఉంటుంది



- సముద్ర జలాలను మంచినీటిగా మార్చాలి
- నాడు లోక్‌సభలో బొత్స ఝాన్సీలక్ష్మి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీ లక్ష్మి ఉన్నత విద్యావంతురాలు. 2006లో బొబ్బిలి లోక్‌సభ సభ్యురాలిగా, 2009లో విజయనగరం ఎంపీగా గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లో విశాఖ ఎంపీగా పోటీ చేస్తున్న ఆమె.. 2009లోనే 'విశాఖ విజన్' పేరిట నగర అభివృద్ధిపై ఆమె పార్లమెంట్‌లో పలుమార్లు ప్రస్తావించారు.

దేశంలోనే అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ నగరం ఒకటి. భవిష్యత్తులో ఇలాంటి నగరంలో తాగునీటి సమస్యలు రాకుండా ఉండేలా ముందుచూపుతో 2009లో లోక్‌సభలో బొత్స ఝాన్సీ లక్ష్మి వినూత్న ఆలోచన చేశారు. అప్పటి కేంద్ర ప్రభుత్వానికి సూచన చేశారు. తాగునీటి సమస్యకు చెక్ చెప్పేందుకు మంచినీటి ఎద్దడిపై అప్పటి కేంద్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని పార్లమెంటులో పట్టుబట్టడం ఆమెకే చెల్లింది. సముద్ర జలాలను తాగునీటి వినియోగార్థం మార్చే డిశాలీనేషన్ ప్రాజెక్ట్‌ను విశాఖలో ఏర్పాటు చేస్తే..ఆంధ్ర తీర ప్రాంతం నీటి కష్టాలను నెరవేర్చగలదని లోక్ సభలో గళమెత్తారు. 2007లో ఏప్రిల్ 27వ తేదీన పార్లమెంటులో 368 నెంబర్ స్టారెడ్ క్వశ్చన్ సంధించారు. దేశంలోనే అతి పెద్ద తీరరేఖ పొడవు 927 కి.మీ ఉన్న ఏపీలో తాగునీటి సమస్య లేకుండా ఉండాలంటే దీనికి శాశ్వత పరిష్కారం డిశాలీనేషన్ ప్రాజెక్ట్ అని వివరించారు. దీనికి అప్పటి కేంద్ర మంత్రి అజయ్ మాకెన్ సమాధానం ఇస్తూ కేంద్ర ప్రభుత్వం నేరుగా త్రాగునీటి అంశాన్ని చూడకపోయినా రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రతిపాదనలతో నిధులు కేటాయిస్తామని సమాధానం చెప్పడం జరిగింది. భీమిలి మున్సిపాలిటీ పరిధిలో 2.86 ఎంఎల్‌డి నీటి ప్రాజెక్ట్ కు కేంద్ర సహకారం ఉంటుందని సమాధానమిచ్చారు. రూ.185 లక్షల నిధులు మంజూరు చేస్తామని హామీ కూడా ఇచ్చారు. ప్రజావసరాలను నెరవేర్చడంలో ఎటువంటి శషభిషలకు పోకుండా పార్లమెంటులో ఝాన్సీలక్ష్మి ప్రయత్నానికి నాడు ప్రజలంతా హర్షం వ్యక్తం చేశారు.

106 తులాల బంగారు ఆభరణాల స్వాధీనం

సీతమ్మధార: అక్కయ్యపాలెం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ఖాళీ చేస్తున్నామని, లాకర్‌లో ఉన్న బంగారు నగలు తీసుకువెళ్లాలని వినియోగదారుడు నాగిరెడ్డికి బ్యాంకు అధికారులు ఫోన్ చేసి చెప్పడంతో..ఆయన బ్యాంకు లాకర్‌లో ఉన్న సుమారు 106 తులాలు బంగారు నగలు తీసుకుని కారులో మురళీనగర్ వెళుతుండగా.. అధికారులు వాహన తనిఖీ నిర్వహించారు. స్టాటిక్ సేవలర్ టీం –3 ,అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.పద్మవతి తనిఖీలు చేస్తుండగా కారులో 106 తులాల బంగారు ఆభరణాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలోని అధికారులకు వీటిని అప్పగించారు. బంగారు నగలకు సంబంధించిన బ్యాంకు అధికారులు రాతపూర్వకంగా ఇచ్చినప్పటికీ నిబంధలు ప్రకారం ఆర్‌వోకు అప్పజెప్పడం మా బాధ్యత అని అధికారులు తెలిపారు. బంగారు నగలను ట్రెజరీలో భద్రపరుస్తున్నట్లు సహాయ ఎన్నికల అధికారి, తహసీల్దార్ జి.శ్రీరామూర్తి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణమా?

- రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్న కానిస్టేబుల్ శంకరరావు

సీతమ్మధార: స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ పాలవలస శంకరరావు ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు అన్వేషిస్తున్నారు. రెండు నెలలుగా ఆర్థిక ఇబ్బందులతో ఆయన బాధపడుతున్నట్టు గుర్తించిన పోలీసులు.. ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. 2010లో పోలీస్ ఉద్యోగంలో చేరిన శంకరరావు హైదరాబాద్‌లో పనిచేశాడు. తర్వాత భద్రాచలంలో మూడేళ్ల పనిచేసి.. విశాఖపట్నానికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఐదేళ్లుగా పనిచేస్తున్నారు. మద్దిలపాలెంలో నివాసం ఉంటున్న శంకరరావు.. క్రికెట్ బెట్టింగ్‌తో పాటు ఇతర వ్యవహారాల కోసం అప్పులు చేసినట్లు పోలీసులు విచారణలో గుర్తించారు. ఈ క్రమంలోనే తోటి స్నేహితుడు వద్ద రూ.3.5 లక్షల వరకు అప్పు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కాగా.. విజయగనరం జిల్లా వంగర మండలం కుట్టిలో శంకరరావు దహన సంస్కారాలు పూర్తయ్యాయి. అతని అంత్యక్రియల కోసం పోలీస్ అధికారులు రూ.20 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఎలక్ట్రికల్ షాపే పేకాట క్లబ్

ఎంవీపీకాలనీ: ఎలక్ట్రికల్ షాపు ముసుగులో గుట్టు చప్పుడు కాకుండా పేకాట క్లబ్ నిర్వహిస్తున్న ఘటన టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడుల్లో వెలుగు చూసింది. ఈ దాడుల్లో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలివీ.. పెదవాల్తేర్ కరూర్ వైశ్యా బ్యాంకు దరిలో ప్రమోద్ అనే వ్యక్తి ఓ ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నాడు. పేరుకు ఇది ఎలక్ట్రికల్ షాపు కాగా.. దీని లోపల కొంతకాలంగా పేకాట క్లబ్ నిర్వహిస్తున్నాడు. దీనిపై వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించగా పేకాట క్లబ్ గుట్టురట్టయింది. ఈ దాడుల్లో 25 విదేశీ మందు బాటిళ్లను టాస్క్‌ఫోర్స్ స్వాధీనం చేసుకుంది. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. కాగా.. క్లబ్ నిర్వాహకుడు ప్రమోద్ పరారీలో ఉండగా అతని కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. కేసు నమోదు కోసం నిందితులను ఎంవీపీ స్టేషన్‌కు అప్పగించారు.

బాధితులకు మొబైల్ ఫోన్ల అప్పగింత

తాటిచెట్లపాలెం: రైల్వేస్టేషన్లు, వివిధ రైళ్లలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గవర్నమెంట్ రైల్వే పోలీసులు రికవరీ చేసి.. బాధితులకు అప్పగించారు. విశాఖపట్నం జీఆర్పీ పరిధిలో మొదటి త్రైమాసికంలో వివిధ రైల్వే స్టేషన్లు, వివిధ రైళ్లలో మొబైల్ ఫోన్లు, ఇతరత్రా విలువైన వస్తువులు పోగొట్టుకున్నట్లు 360 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో సుమారు రూ.10లక్షల విలువ చేసే 60 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. ఈ మొబైల్ ఫోన్లను శుక్రవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ స్టేషన్ వద్ద బాధితులకు అందజేశారు. రైల్వేస్టేషన్లు, రైళ్లలో మొబైల్ ఫోన్లు చోరీకి గురైనా, పోగొట్టుకున్నా.. ఆధార్ కార్డ్‌తో వచ్చి ఫిర్యాదు చేయాలని జీఆర్పీ డీఎస్పీ బి.మోహనరావు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ రైల్వే పోలీస్ సీహెచ్ ధనుంజయ నాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల అమ్మకాల్లో పద్మజ సుజుకి రికార్డ్

బీచ్‌రోడ్డు: పద్మజ సుజుకి రికార్డ్ స్థాయిలో సేల్స్‌ని సాధిస్తూ రెండు లక్షల అమ్మకాల మైలురాయిని దాటింది. ఈ సందర్భంగా సిరిపురంలోని షోరూంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు.ఈ వేడుకల్లో పాల్గొన్న వరుణ గ్రూప్ ఎండీ వరుణ్ దేవ్ మాట్లాడుతూ పద్మజ సుజుకి రికార్డు స్థాయిలో అమ్మకాలను సాధించడమే కాకుండా వినియోగదారులకు సంతృప్తికరంగా సేవలు అందించడంలోనూ నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. రెండు లక్షల అమ్మకాలు దాటడం సంస్థకు గర్వకారణమన్నారు. ఇంతటి విజయానికి కారణమైన సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలు ఆఫర్లను ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్ కుమార్, జీఎం రఫీ తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ తూర్పు' లో 16 వేల కొత్త ఓట్లా?

- అనుమానం వ్యక్తం చేసిన రాజకీయ పార్టీలు
- పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ: జిల్లాలో ఏ నియోజకవర్గంలోనూ 5 వేల నుంచి 7 వేల దాటని కొత్త ఓటర్లు.. విశాఖ తూర్పులో 16 వేలు నమోదు కావడంపై పలు రాజకీయ పార్టీల నాయకులు అనుమానాలు వ్యక్తం చేశారు. కలెక్టర్ మల్లికార్జునతో జరిగిన సమావేశంలో ఈ విషయంలో పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ ఎ.మల్లికార్జున తొలి విడత ఈవీఎంలను కేటాయించే ప్రక్రియ చేపట్టారు. రూరల్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఈవీఎం గోదాంను శుక్రవారం ఆయన సందర్శించారు. అక్కడ వీవీ ప్యాట్‌ల పరిరక్షణ, సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బంది పనితీరు పరిశీలించారు. పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారుల సమక్షంలో నియోజకవర్గానికి ఎన్నెన్ని ఈవీఎంలు అవసరమో డిజిటల్ విధానంలో కేటాయించారు. అనంతరం పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఇందులో భాగంగా ఇటీవల జరిగిన కొత్త ఓటర్ల నమోదుపై రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్ వద్ద పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అన్ని నియోజకవర్గాల్లో కంటే విశాఖ తూర్పులో 16 వేలకు పైగా కొత్త ఓటర్లు నమోదు జరిగినట్లు ఆయనకు దృష్టికి తీసుకెళ్లారు. ఏ నియోజకవర్గంలోనూ 5 వేల నుంచి 7 వేల దాటని కొత్త ఓటర్లు.. తూర్పులో 16 వేలు దాటడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన కలెక్టర్ తూర్పు నియోజకవర్గంలో కొత్తగా నమోదైన ఓటర్ల చిరునామాలను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, ఆయా చిరునామాలకు వెళ్లి వీడియోలు తీయిస్తామని నాయకులకు హామీ ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి, గాజువాక ఆర్వో లక్ష్మారెడ్డి, ఎన్నికల సెల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రవిరెడ్డి, బీజేపీ నాయకుడు కె.వి.రమణ, టీడీపీ, ఆప్ తదితర పార్టీల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

> గతంలో వెలగపూడి రామకృష్ణ బాబు గీతం వర్సిటీలో చదివిన కృష్ణా, ఉభయ గోదావరి తదితర జిల్లాలకు చెందిన విద్యార్థులతో ఓట్లు నమోదు చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. వారి ఓట్లతోనే ఆయన గెలుపొందినట్లు నాయకులు చెబుతుంటారు. మళ్లీ అదే రీతిన టీడీపీ నాయకులు ఈ ప్రాంతానికి సంబంధం లేని వ్యక్తులను కొత్త ఓటర్లుగా నమోదు చేయించి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఏ నియోజకవర్గంలో నమోదు కాని కొత్త ఓటర్లు.. తూర్పులో నమోదైనట్లు భావిస్తున్నారు. దీనిపై ఎన్నికల విభాగం అధికారులు పూర్తిస్థాయి దృష్టి పెట్టాలని పలు రాజకీయ పార్టీల నాయకులు కలెక్టర్‌ను కోరారు.

బజాజ్ పల్సర్ 150 ఎస్‌డీ, టీడీ బైకుల ఆవిష్కరణ


బజాజ్ పల్సర్ 150 ఎస్‌డీ, టీడీ బైకులు ఆవిష్కరిస్తున్న సీఈవో శ్రీనివాస్

బీచ్‌రోడ్డు: సరికొత్త డిజిటల్ కన్సోల్‌తో బజాజ్ పల్సర్ 150 ఎస్‌డీ, టీడీ బైకులను శుక్రవారం సిరిపురంలోని వరుణ్ బజాజ్ షోరూంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరుణ్ బజాజ్ సీఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ బైకులను బ్లూటూత్ సదుపాయంతో కూడిన సరికొత్త రివర్స్ ఎల్‌సీడీ కన్సోల్‌ను పొందుపరిచారన్నారు. యూఎస్‌బీ చార్జింగ్ సదుపాయంతో పాటు గేర్ పొజిషన్ ఇండికేటర్, మొబైల్ నోటిఫికేషన్, కాల్ యాక్సెప్ట్ లేదా రిజెక్ట్ చేసే సౌలభ్యం ఉందన్నారు. పల్సర్ 150 సింగిల్ డిస్క్ ఎక్స్ షోరూం రూ.1,12,301, ట్విన్ డిస్క్ రూ.1,16,237గా నిర్ణయించినట్లు చెప్పారు.

వికసించిన విద్యా కుసుమాలు


విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాల

డాబాగార్డెన్స్: ప్రభుత్వ బాలికల కళాశాలలో చదివిన విద్యా కుసుమాలు వికసించాయి. చదువుకు పేదరికం అడ్డురాదని విద్యార్థులు నిరూపించి.. కార్పొరేట్ కళాశాలకు దీటుగా రాణించారు. శుక్రవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. సీనియర్ ఎంపీసీలో అలుపున మేనక 965, విస్సరపు మనూష 962, గెద్దనపల్లి నవ్య కీర్తన 955, సారా ఆశ్రిత 953, ఆర్.తేజస్విని 941, బుద్దా జయంతి 939, రేష్మా కుమారి సాహూ 934, కె.ధరణి 929, దమరసింగి నందిని 922, సీహెచ్ జ్యోత్స్న 900 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో గుసిడి గీతాంజలి 951, బోర హారిక 944, చందక లోహిత 937, దాడి శరణ్య 924, జిలాం పావని 919, రాంబోతు ఉషా 911 మార్కులు సాధించారు. సీఈసీలో ఎల్.లక్ష్మీ ప్రసన్న 914, ఎస్.సాయినిఖిత 911, మహ్మద్ ఆశీవ బేగం 891 మార్కులు సాధించగా, ఎంఈసీలో వాకపల్లి అమృత 840, యేరుపిల్లి ప్రేమకుమారి 826, జి.భవాని 800, హెచ్ఈసీలో రౌతు ఝాన్సీ 837, చింతకాయల జాజి 833 మార్కులు సాధించారు.

ఇంటర్ ఫలితాల్లో తిరుమల హవా


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

తగరపువలస: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో భీమిలి మండలం తాళ్లవలస తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు గానూ ఆర్.యశ్వంత్, పి.కుందనిక, వై.స్నేహిత 466 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో బి.రాజ తన్మయ, డి.లీలాలక్ష్మి, రౌతు మోనిషాసాయి 435 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఫైనలియర్ ఎంపీసీ విభాగంలో పి.తనుశ్రీ, పి.హరిత 989 మార్కులు, బైపీసీలో పి.తనూజ 990 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను రెసిడెంట్ డైరెక్టర్లు ఇ.మృత్యుంజయరావు, కె.ఎస్.వి.వి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, జి.సతీష్‌బాబు అభినందించారు.

శశి విద్యార్థుల ప్రభంజనం


వేదేంద్ర వర్ధన్, ఎంపీసీ, 990 | పాడి హర్షిత, బైపీసీ, 989 | గెద్ద వైష్ణవి, ఎంపీసీ, 465 | త్రివేణి తేజ, ఎంపీసీ,465 | కొమర ఇందు, బైపీసీ, 435

తగరపువలస: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో సంగివలస శశి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ సంస్థ విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. సీనియర్ ఇంటర్మీడియట్‌లో 520 మంది విద్యార్థులకు గానూ 519 ఉత్తీర్ణులయ్యారన్నారు. వీరిలో అత్యధికంగా 990 మార్కులకు పైగా సాధించారన్నారు. సీనియర్ బైపీసీలో 119 మంది విద్యార్థులకు గానూ నూరుశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో 989 మార్కులకు పైగా విద్యార్థులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ విభాగంలో 705 మంది విద్యార్థులకు గానూ 698 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. వీరిలో 465 మార్కుల కంటే ఎక్కువ విద్యార్థులు సాధించారన్నారు. బైపీసీ విభాగంలో 127 మంది విద్యార్థులకు గానూ నూరు శాతం ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ తదితరులు అభినందించారు.

గురుకుల విద్యార్థినుల ప్రతిభ


కె.దీపిక (ఎంపీసీ, 981) | సుప్రియ (బైపీపీ, 958) | ఎస్.రూపిణి (ఎంపీసీ, 457) | హాసిని రెడ్డి (ఎంపీసీ, 457)


స్పందన (బైపీసీ, 427)

మధురవాడ: ఇంటర్ ఫలితాల్లో మారికవలస గురుకుల ప్రతిభా పాఠశాల విద్యార్థులు 96.26 శాతం ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్‌లో 81 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 78 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 79 మంది పరీక్షలకు హాజరు కాగా 78 మంది ఉత్తీర్ణులై 98.7 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో కె.దీపిక 981, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో వీరకోట హాసిని రెడ్డి, సవర రూపిణి 457 మార్కులు సాధించారు. బైపీసీ ప్రథమ సంవత్సరంలో మేకల స్పందన 427 మార్కులు, ద్వితీయ ఇంటర్‌లో సోడే సుప్రియ 958 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ విశ్వనాథం చెప్పారు. కాగా.. మధురవాడ రేవళ్లపాలేనికి చెందిన నాగోతి అప్పలరాజు అనే తాపీమేస్త్రి కుమార్తె దేవశృతి 431 మార్కులు సాధించింది.

ఎసెంట్ విజయదుందుభి


జె.సిద్ధార్థరెడ్డి (ఎంపీసీ, 466) | బి.హర్షదీప్ (ఎంపీసీ, 989) | ఆర్జి జోషిత (బైపీసీ,983)

మద్దిలపాలెం: ఇంటర్ ఫలితాల్లో ఎసెంట్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 94.6 శాతం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 98.3 శాతం ఉత్తీర్ణత నమోదు చేసినట్లు ప్రిన్సిపాళ్లు బి.శ్రీనివాసరావు, ఎం.గౌరినాయుడు తెలిపారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో జామి సిద్ధార్థ రెడ్డి 466, ద్వితీయ సంవత్సరంలో బొతిపి హర్షదీప్ 989 సాధించారు. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో ఆర్జి జోషిత 983 సాధించింది. కళాశాల నుంచి ప్రథమ సంవత్సరం ఎంపీసీ పరీక్షలకు 825 మంది హాజరుకాగా 148 మంది 95 శాతంపైగా, 310 మంది 90 శాతం మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ పరీక్షలకు 778 మంది హాజరు కాగా.. 14 మంది 98 శాతంతో ఉత్తీర్ణత సాధించారన్నారు. 119 మంది 95 శాతం, 300 మంది విద్యార్థులు 90 శాతం పైగా సాధించారన్నారు. బైపీసీ నుంచి 35 మంది హాజరు కాగా ఐదుగురు 95 శాతంతో, 16 మంది 90 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు వారు వివరించారు.

సత్తా చాటిన శ్రీచైతన్య


విద్యార్థులతో శ్రీ చైతన్య నిర్వాహకులు


తల్లిదండ్రులతో రేవతి

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యా సంస్థల విద్యార్థులు సత్తా చాటారు. విశాఖ జోన్ పరిధిలోని విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడం ద్వారా రాష్ట్ర స్థాయిలో టాపర్స్‌గా నిలిచారని విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి.రమణ వెల్లడించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో సీహెచ్.రేవతి 467 మార్కులతో అగ్రగామిగా నిలిచిందన్నారు. 466 మార్కులకు పైగా నలుగురు, 465 ఆ పైన 23 మంది, 460కు పైగా 353 మంది, 450కు పైగా 1,210 మంది, 400 మార్కులకు పైగా 4,937 మంది తమ విద్యా సంస్థల నుంచి సాధించి.. విశాఖ రీజియన్‌లో తిరుగులేని రీతిలో ఫలితాలు సాధించారన్నారు. బైపీసీ విభాగంలో బి.హర్షవర్ధన్ సాయి 435, సీహెచ్.రిషిత 435, అదే విధంగా 430 మార్కులకు పైగా 65 మంది, 425కు పైగా 164 మంది, 420కు పైగా 261 మంది, 410కు పైగా 444 మంది, 400కు పైగా మార్కులను 615 మంది సాధించారన్నారు. ఎంఈసీలో టి.సాయి శ్రీ ప్రశాంతి 481, కె.శ్రావణ్ సాయి 481, ఎస్.వాసు 480 మార్కులు సాధించినట్లు తెలిపారు. 480కు పైగా ముగ్గురు, 460కు పైగా 9 మంది మార్కులు సాధించినట్లు వెల్లడించారు. రెండో సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో ఎస్.మేఘా దీపక్ 990, డి.ప్రేమ్ చరణ్ 990, ఆర్.దీపిక కీర్తి 989, ఎం.చరణ్ 990 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకులు కైవసం చేసుకున్నారన్నారు. 900కు పైగా 3,968 మంది సాధించినట్లు తెలిపారు. బైపీసీ విభాగంలో ఎస్.పావని 991, పి.దాక్షేష్ 989, ఆర్.దీపిక కీర్తి 989 మార్కులతో మంచి ర్యాంకులు సాధించారన్నారు. 900కు పైగా మార్కులు 874 మంది విద్యార్థులు సాధించినట్లు చెప్పారు. ఎంఈసీ విభాగంలో ఎన్.కీర్తి 971 మార్కులతో సత్తా చాటాడన్నారు. 960 ఆ పైమార్కులతో నలుగురు, 900కు పైగా 23 మంది సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఇందుకు కృషి చేసిన అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీన్లు కె. బంగారు బాబు, ఎస్.రఘుకుమార్ పాల్గొన్నారు

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.73,310
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.67,200
వెండి(కిలో):	రూ.90,000

దూసుకొచ్చిన మృత్యువు

- బయ్యవరం హైవే వద్ద అదుపు తప్పిన ప్రైవేట్ కళాశాల వాహనం
- రోడ్డు పక్క మొబైల్ క్యాంటీన్‌ను ఢీకొనడంతో 11మందికి గాయాలు
- అక్కడికక్కడే బాలుడు మృత్యువాత.. తల్లికి తీవ్ర గాయాలు
- ప్రమాదంలో చిక్కుకున్న పెందుర్తికి చెందిన ముస్లిం కుటుంబం


చికిత్స పొందుతున్న షేక్ రెహమాన్‌తో మాట్లాడుతున్న పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు


రోడ్డు పక్కనున్న మొబైల్ క్యాంటీన్ వాహనాన్ని ఢీకొన్న ప్రైవేట్ కళాశాల బస్సు


క్షతగాత్రురాలు, ప్రమాదంలో మృతి చెందిన షేక్ గౌస్

కశింకోట: అదుపు తప్పి మొబైల్ క్యాంటీన్ మీదకు దూసుకొచ్చిన ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల బస్సు బీభత్సం సృష్టించింది. ఆ సమయానికి అక్కడున్న పదకొండుమంది గాయపడగా అందులో 12 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కశింకోట మండలం బయ్యవరం జాతీయ రహదారి వద్ద శుక్రవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. సీఐ ఎం.వినోద్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం.. పెందుర్తి రెల్లికాలనీకి చెందిన షేక్ రెహమాన్ తన మేనల్లుని వివాహం పురస్కరించుకొని కుటుంబ సభ్యులతో కలిసి కారులో పిఠాపురంలోని బంధువుల వద్దకు బయలుదేరారు. కశింకోట మండలం బయ్యవరం వద్ద ఆగి మొబైల్ క్యాంటీన్ దగ్గర టిఫిన్ చేస్తుండగా.. అనకాపల్లి నుంచి మాకవరపాలెం వైపు విద్యార్థులతో వెళుతున్న ప్రైవేటు కళాశాల బస్సు దూసుకొచ్చింది. పక్కగా వెళుతున్న కారును తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి కొత్తపల్లి రోడ్డు వైపు వేగంగా దూసుకుపోయి పక్కనున్న మొబైల్ టిఫిన్ వాహనాన్ని ఢీకొంది. ఈ దుర్ఘటనలో షేక్ రెహమాన్ కుమారుడు షేక్ గౌస్ (12) అక్కడిక్కడే మృతి చెందాడు. రెహమాన్‌తోపాటు భార్య షేక్ ఉన్నిసా బేగం వారి కుమార్తె షబ్బీర్ యాసిన్, మేనల్లుడు షేక్ అలీ హుస్సేన్, బంధువు సయ్యద్ బాబ్జీ, టిఫిన్ సెంటర్ నిర్వాహకురాలు గొన్నాబత్తుల లక్ష్మి, టిఫిన్ చేస్తున్న స్థానికులు కరణం లక్ష్మణరావు, గొల్లవిల్లి రమణమ్మ, అనిల్‌కుమార్, రామకృష్ణ గాయపడ్డారు. వీరిని హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి, ఉషా ప్రైమ్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో రెహమాన్ భార్యకు పక్కటెముకలకు, తలకు బలమైన గాయమై విషమంగా ఉండడంతో విశాఖ డెయిరీ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారు అనకాపల్లి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. షేక్ అలీ హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం జరిపించినట్లు సీఐ తెలిపారు. ప్రమాదంలో నాలుగు మోటారు సైకిళ్లు, క్షతగాత్రుల కారు, టిఫిన్ సెంటర్ వాహనం దెబ్బతిన్నాయి. ప్రమాదానికి కారణమైన కళాశాల బస్సును స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

అనకాపల్లి: కశింకోట మండలం బయ్యవరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను శుక్రవారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ పరామర్శించారు. రెహమాన్ కుటుంబ సభ్యులతో తనకు 25 సంవత్సరాలుగా ఎంతో అనుబంధం ఉందని అదీప్‌రాజు చెప్పారు. మూడు రోజుల క్రితం రంజాన్ దీక్షలు చేస్తున్నప్పుడు వారి ఇంటికి వెళ్లానన్నారు. ప్రభుత్వం తరపున రెహమాన్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేసి కుటుంబానికి అండగా నిలుస్తానని ఆయన పేర్కొన్నారు.